# ఉద్గ్రంథం

[విజయ మాసపత్రిక]

"నువ్వేదో పుస్తకం చదువుతావు కదా !
అందులో మళయాళ మంత్రాలున్నాయా?"
"అవేమిటి ?"
"మంత్రాలతో మొగుళ్లను లొంగ దీసుకో
వచ్చునట !"
"మంత్రాలకు చింతకాయలు రాల్తాయా ?"
ఇంతకీ భార్య పారాయణం చేసే ఆ
ఉద్గ్రంథం ఏమిటి?....

# ఉద్గ్రంథం

"నీ వరస నాకేం నచ్చలేదు" విసుగ్గా అన్నాడు రామ్మూర్తి.

"ఎందుకు నచ్చలేదు?" అని అడగలేదు అరుణ.

"నా మాటలు నీకు వినిపిస్తున్నాయా?" ఈసారి మరింత చిరాకు పడ్డాడు.

"వినిపిస్తున్నాయి!" అంది సాధ్యమయినంత మెల్లగా.

"వినిపిస్తే సమాధానం చెప్పవేం? తలబిరుసా ?"

"ఏం సమాధానం చెప్పమంటారు ?" అంది అరుణ.

"అదేదో నేనే చెప్తే తిరిగి నాకే ఆ సమాధానము వల్లిస్తావు కాబోలు అంతేనా?"

'అంతే' అనలేదు అరుణ. అంటే కొంప అంటుకుంటాయి. అనవసరంగా భర్తను రెచ్చగొట్టి గొడవను మరింత పెద్దది చేయటం యిష్టం లేదు.

తనలో భర్తకు నచ్చని విషయాలేవో అరుణకు తెలుసు.

తను శుభ్రంగా ముస్తాబు కాకూడదు. మంచి చీర కట్టుకుని ఎవరి కంటా పడకూడదు. తను అందంగా కనుపించకూడదు. మనసు విప్పి హాయిగా నవ్వకూడదు. తనో మనిషిలా ప్రతకూడదు. అతడు ఎంత మూర్ఖంగా మాట్లాడినా ఎదురు చెప్పకూడదు. ఎదురుచెప్తే — నిర్లక్ష్యం, తలబిరుసుతనం!

తను బీద కుటుంబంలోంచి వచ్చింది. రామ్మూర్తి కాస్త డబ్బున్న వాడే. తన అందానికి మురిసిపోయి తనను చేసుకున్నాడు.

తన అందం తన శత్రువయిపోయింది.

తనకు ఏ విషయంలోనూ స్వేచ్ఛలేదు. తనో మరబొమ్మ అతని దృష్టిలో. అసలు, ఈ రాద్ధాంతానికి కారణం నిన్న రాత్రి సినిమా హాలులో జరిగిన సంఘటన! ఎవరో పోకిరీ వెధవ తనని చూసి నవ్వేడు. నవ్వి

ఊరుకోక 'హలో' అంటూ పలకరించేడు. వాడెవడో తనకు తెలీదు. తను ఏనాడూ వాడి మొహం చూడలేదు.

సినిమానుండి వస్తుంటే "పాతప్రియుడా?" అన్నాడు రామ్మూర్తి.

తనకు ఒళ్ళు మండిపోయింది. అయినా కోపం అణచుకుంది.

"వాడెవడు?" అన్నాడు మళ్ళీ.

"ఏమో, నాకేం తెలుసు?" అంది.

"తెలియకపోతే 'హలో' అంటూ ఎందుకు పలుకరించేడు!"

"ఎలా పలుకరించేడో-చెట్టంత భర్త. మీరు ప్రక్కనే వున్నారు కదా, అడగకపోయారా?" అంది.

అంతే! రిక్షాలో వున్నామన్న జ్ఞానం కూడా లేకుండా చెంప పగుల కొట్టేడు. పైకి వినపడకుండా కుళ్ళి కుళ్ళి ఏడ్చింది— తెల్లారి ఆ విషయం మరిచిపోదామని యత్నించింది. కాని భర్త ఆ ప్రయత్నం కొనసాగిస్తే కదా!—

వాడెవడో చెప్పమంటాడు.

ముక్కూ- మొహం తెలియని ఆ వెధవెవరో తనెలా చెప్పగలదు?

"ఇలా అయితే నీకూ, నాకూ పొసగదు! నువ్వు మీ పుట్టింటికి పో" అన్నాడు రామ్మూర్తి. ఈ మూడు నెల్లలోనూ ఇది ఎనిమిదోమాటు— ఈ రకమయిన హెచ్చరిక వినటం.

అరుణ సూటిగా రామ్మూర్తి కళ్ళల్లోకి చూసింది. తరువాత లేచి తిన్నగా వంటింట్లోకి వెళ్లి తలుపు లోపల గడియ పెట్టుకుని దేవుని పీఠం క్రింది భాగంలో తను జాగ్రత్తగా దాచి వుంచిన పుస్తకం తీసి చదవటం ప్రారంభించింది.

* * *

అరుణ వంటింట్లోకి వెళ్ళి తలుపు గడియ వేసుకోటంతో రామ్మూర్తికి మతిపోయినట్లయింది. అతని కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. అతనికి

తెలుసు. ఇపుడు అరుణ ఏం చేస్తుందో! దేవుడి దగ్గర కూర్చుని అదేదో గ్రంథం చదువుతుంది. ఆ పుస్తకంలో ఏదో మళయాళ మంత్రాల్లాంటివి వుండి వుంటాయి. వాటిని తనమీద ప్రయోగించటానికి చూస్తోంది. తను గట్టిగా పోట్లాడి 'నువ్వు మీ పుట్టింటికి పో!' అన్నపుడల్లా ఈ గ్రంథం చదువుతుంది అరుణ. రెండు నెలల క్రితం వాళ్ల అన్నయ్యకు ఉత్తరము రాసి ఆ పుస్తకం తెప్పించుకుంది. ఆ పుస్తకం ఎప్పుడూ తన కంట పడ నివ్వదు. కాని, తను బెదిరించినపుడల్లా ఆ పుస్తకం దగ్గరకు పరుగెడు తుంది. క్రితంసారీ ఇలాగే జరిగింది.

"నువ్వేదో పుస్తకం చదువుతావుకదా! అందులో మళయాళ మంత్రా లున్నాయా?" అంటూ హేళనగా అడిగేడు.

"అవేమిటి?" అమాయకంగా అంది అరుణ.

"మంత్రాలతో మొగుళ్ళని లొంగదీసుకోవచ్చుట."

"మంత్రాలకు చింతకాయలు రాల్తాయా ?" అంది.

"మరి ఆ పుస్తకం ఏమిటి? కాళీ ఉపాసన చేస్తున్నావేమిటి, కొంప దీసి ?"

"అదొక్కటే తరవాయి" అంది.

రామ్మూర్తికి ఒళ్ళు మండిపోయింది. అరుణ సరిగ్గా సమాధానం చెప్పదు.

ఆ పుస్తకం చదివి ఎక్కడో దాచేస్తుంది. ఆమె ఆ పుస్తకం చది విందంటే రామ్మూర్తికి భయమే! మెల్లగా లేచి కిటికీలోంచి చూశాడు.

అరుణ వ్యాసపీఠంలో ఆ పుస్తకం వుంచి, చదువుతోంది. అలాటి స్థితిలో ఆమెను చూస్తే రామ్మూర్తికి భయం. ఆమె ముఖం నిండా యేదో స్వచ్ఛత, పవిత్రత ఉట్టిపడుతున్నట్లుంది.

అరుణ చాలా నిశ్చయమైన మనిషి. ఆ నిశ్చలతే రామ్మూర్తిని కాల్చుకు తింటోంది. రామ్మూర్తి తిరిగొచ్చి మంచంమీద కొంతసేపు ఇటూ అటూ దొర్లేడు.

ఓ పావుగంట తర్వాత మళ్ళీ వంటింటివద్దకు వెళ్ళి కిటికీలోనుండి చూశాడు.

అరుణ ఆ పుస్తకం చదవటం ముగించి దేవునిపీఠంలో పెడుతోంది. మీద పువ్వులు కప్పేసి సామానులు సర్దేస్తోంది.

"తలుపు తియ్" అన్నాడు విసురుగా.

అరుణ మెల్లగా లేచి వచ్చి తలుపులు తెరిచింది. నుదుట రూపాయ కాసంత కుంకుమబొట్టు, కళ్ళు అరుణిమ దాల్చి భయంకరంగా వున్నాయి.

"పుస్తకం చదివేశావా?" ధైర్యం కూడగట్టుకొని అడిగేడు.

"ఆ! పూర్తయిపోయింది" అంది అరుణ నిశ్చలంగా.

"ఇంతకీ ఆ పుస్తకం ఏమిటో నాకు చెప్తావా - చెప్పవా?"

"నా నోటితో చెప్పటం ఇష్టంలేదు" అంది అరుణ.

రామ్మూర్తికి కంపర మెత్తుకొస్తోంది. ముందుకు రెండడుగులు వేసి "నేను చూస్తాను" అన్నాడు.

"ఆగండి!" అరిచింది అరుణ.

"తెల్లారి లేచి స్నానమయినా చేయలేదు మీరు. పవిత్రమైన దేవుని పీఠం తాకకండి."

నీరసంగా అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చేశాడు. ఆ పుస్తకము తీసి అదేమిటో చూడాలన్న తపన అతనిలో అధికమయింది. తొందరగా స్నానం ముగించి దైవసన్నిధిలోని కుంకుమ నుదుటన ఉంచుకున్నాడు. కాళీమాతకు నమస్కరించి పువ్వుల కింద వున్న ఆ పుస్తకాన్ని వణికే చేతుల్తో బైటకు తీశాడు.

ఈ తతంగమంతా అరుణ కదలకుండా నిలబడి చూస్తోంది.

రామ్మూర్తి పుస్తకంమీది పేరు చూసి స్థాణువయి పోయేడు.

"ఇదెందుకు చదువుతున్నావు?" కొంతసేపు పోయాక తెప్పరిల్లి అన్నాడు.

"మీరు ఈ మూడు నెలల్లోనూ ఎనిమిదిసార్లు నన్ను పుట్టింటికి పొమ్మన్నారు. అంటే, మనం కలిసి బ్రతకటం మీకు ఇష్టం లేనట్లు స్పష్టమవుతూనే వుంది. మీరు నన్ను వదిలేస్తే ఈ సంఘం నాకు ఏ మాత్రం రక్షణ కల్పిస్తుందో, చట్టం ఏ మాత్రం ఆదుకుంటుందో తెలుసుకోవాలి కదా! లేకపోతే మీ నుండి విడాకులు పొందేక నా భావి జీవితానికి 'సెక్యూరిటీ' ఏముందో నాకేం తెలుస్తుంది? ప్రస్తుతం నేను మీ దయాధర్మాలమీద ఆధారపడి బ్రతుకుతున్నాను. అది నిజం కాదనుకోండి, అయినా, మీరు అలాగే అనుకుంటున్నారు. ఈ కాస్త చోటూ నాకు మీరు లేకుండా చేస్తే నా గతి ఏమిటో నేను తెలుసుకోవాలని ప్రయత్నించేను, తెలుసుకున్నాను. అంతే!" అంది అరుణ.

రామ్మూర్తి చెవులు బిల్లులు పడిపోతున్నాయి. అతని చేతిలోని పుస్తకం 'హిందూ విడాకుల చట్టం' పట్టుదప్పి నేలమీదకు జారిపోయింది.